
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 4 । జూన్ । 2025



సోమశిలలో 41.680 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 41.680 టీఎంసీలు ఉన్నాయి. 428 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, డెల్టాకు 2,760 , ఉత్తర, దక్షిణ కాలువలకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,260
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,080
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,352
నవర (8 గ్రాములు)	రూ.74,816

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.3 /29.8

జిల్లాలో బుధవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు ఉండొచ్చు. గాలిలో తేమ 43 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

అన్ని మండలాల్లో యోగా పోటీలు

• ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు రూరల్: మండల స్థాయి యోగా పోటీలను ఈ వారాంతం లోగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన యోగాంధ్ర కార్యక్రమాలపై జిల్లా అధికారులు, ఎంపీడీఓలు మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో యోగా పోటీలు పూర్తయ్యాయని, అక్కడి విజేతలకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను గుర్తించి డేటా ఎంట్రీ చేయాలన్నారు. మండల స్థాయి యోగాంధ్ర పోటీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామ స్థాయి ట్రైనర్లకు పౌరులతో మ్యాపింగ్ చేయాలన్నారు. యోగాంధ్రకు జిల్లాలో 10 లక్షల మందిని రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 8 లక్షల మందికి పైగా రిజిస్ట్రేషన్ జరిగాయన్నారు. టార్గెట్ పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

బంగారం మళ్లీ మెరుపులు

• 10 గ్రాములు రూ.లక్షకుపైగా..

నెల్లూరు (బృందావనం): పది గ్రాముల మేలిమి బంగారం ధర మంగళవారం మళ్లీ లక్ష రూపాయలు దాటింది. ఏప్రిల్ 22న లక్షకు చేరువైంది. రోజు రోజుకు దోబూచులాటలాడుతూ మే 3వ తేదీన 24 క్యారెట్లు 10 గ్రాముల పసిడి ధర రూ.96,500 చేరింది. మే 6వ తేదీకి ఏకంగా ఒక్కసారిగా రూ.1,00,006కు చేరుకోగా, ఆ మరుసటి రోజు మే 7వ తేదీకి రూ.1,00,600లకు పెరిగింది. చేరింది. మే 8వ తేదీన రూ.600 తగ్గి రూ.లక్ష వద్ద నిలబడింది. ఆ తర్వాత తగ్గుతూ.. ఎగబాకుతూ రూ.95 వేలకు చేరింది. తాజాగా అంతర్జాతీయంగా చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో పుత్తడి పెరుగుదల తాత్కాలికమే అనడంతో కొనుగోలుదారులు కొంత ఊరట చెందారు. నెల రోజులుగా దిగొచ్చిన ధర మంగళవారం నాటికి రూ.1,00,260కి చేరింది. గతేడాది జూన్ 3వ తేదీన 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ.73,900 కాగా సరిగ్గా సంవత్సరానికి రూ.26,360 పెరగడం విస్మయం కలిగిస్తోంది.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

• ఐదు రోజులపాటు డిపోల ఎదుట ఎర్ర బ్యాడ్జీలతో నిరసన



ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిరసన చేస్తున్న కార్మిక సంఘ నాయకులు


నెల్లూరు సిటీ: ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ (నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్) జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు అన్ని ఆర్టీసీ డిపోల్లో కార్మికులు, ఉద్యోగులు మంగళవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని కార్మికులు సమస్యలపై గతంలో అనేక వినతులు ఇచ్చినా అధికారుల్లో స్పందన లేదన్నారు. ఆర్టీసీ ఆర్‌ఎం తీరుకు నిరసనగా మంగళవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు డిపో గ్యారేజ్ కార్యదర్శి కిషోర్‌బాబు అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలన్నారు. కందుకూరు అసిస్టెంట్ మేనేజర్ చేసిన కార్గో అవినీతిపై విచారణ జరిపించాలన్నారు. కండక్టర్ వెంకటేశ్వర్లు అక్రమ సస్పెన్షన్‌ను తొలగించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్‌ఎంయూఏ అధ్యక్షుడు చెంచయ్య, జానా వెంకటేశ్వర్లు, రామ్‌ప్రసాద్, సునీల్‌బాబు, కేవీఆర్ రెడ్డి, మస్తానయ్య పాల్గొన్నారు.

రేపు వనమహోత్సవం

• ఒకే రోజు 4.20 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం

నెల్లూరు (అర్బన్): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అటవీశాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 4.20 లక్షల మొక్కలను నాటేందుకు చర్యలు చేపట్టామని జిల్లా అటవీశాఖాధికారి మహబూబ్‌బాషా తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూతాపం తగ్గాలన్నా, వర్షాలు సకాలంలో కురవాలన్నా అడవులు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సంవత్సరం వ్యవసాయ, ఇతర శాఖల సమన్వయంతో 50 లక్షలు మొక్కలు నాటబోతున్నామన్నారు. రైతుల వ్యవసాయ భూముల గట్లు, బీడు భూములు, ప్రభుత్వ భూముల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో మొక్కలు నాటి వాటి పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నెల్లూరు కొత్తూరు సమీపంలోని నగరవనంలో జిల్లా స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు.

కట్టప్ప కూటమి



కూటమి సర్కార్ సమర్పించిన 'వెన్నుపోటు' సినిమాకు ఏడాది అయింది. ఆ పార్టీ దర్శకత్వం, స్క్రీన్‌ప్లే పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం బాక్సాఫీస్ బద్దలు కొడుతోంది. జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలకు బాహుబలి కట్టప్పకు మించిన స్థాయిలో వెన్నుపోటు పొడిచింది. ఒక వైపు సంక్షేమ పథకాలు అందక.. మరోవైపు బతుకుదెరువు కోల్పోయి.. ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఉపాధి పథకం పనుల డబ్బులు తప్పుడు మస్టర్లతో తమ్ముళ్లు జేబుల్లో వేసుకుంటున్నారు. జిల్లాలో దొరికే ఇసుక.. ఇక్కడి అవసరాలకు అందకపోవడంతో నిర్మాణ రంగం కుదేలైపోయింది. మరో వైపు మద్యం విచ్చలవిడిగా విక్రయాలు చేయడంతో వచ్చే అరకొర సంపాదనను మగాళ్లు మద్యానికి తగలేస్తున్నారు. ఏడాది కాలంలో జిల్లాలో కనీసం ఒక్క మినీ పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు. వ్యవసాయం ఎత్తిపోయింది. పాడి పరిశ్రమ కూప్పకూలింది.

- ఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలు
- అన్నింటికీ పంగనామాలు
- ప్రశ్నించే ప్రతిపక్ష గళాలకు సంకెళ్లు
- అడుగడుగునా కోరలు చాస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగం
- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది
- నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం'

జిల్లాలో సూపర్ సిక్స్ పథకాలకు అర్హులు

పథకం	లబ్ధిదారులు	ఏడాదికి నష్టం రూ.కోట్లలో
ఆడబిడ్డ నిధి	10,52,819 మంది	1,896
తల్లికి వందనం	4.10 లక్షల మంది	615
ఉచిత బస్సు	11 లక్షల మంది	220
ఉచిత గ్యాస్	7.3 లక్షల కుటుంబాలు	197
నిరుద్యోగ భృతి	4 లక్షలపైనే..	1,440
అన్నదాత సుఖీభవ	2.45 లక్షల మంది	430
	మొత్తం	4,798

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో అందిన సాయం

పొదుపు రుణాలు	రూ.5,544.54 కోట్లు
వైఎస్సార్ సున్నా వడ్డీ	రూ.202.35 కోట్లు
స్త్రీ నిధి రుణాలు	రూ.492.70 కోట్లు
వైఎస్సార్ ఆసరా	రూ.853.69 కోట్లు
వైఎస్సార్ చేయూత	రూ.927.66 కోట్లు
జగనన్నతోడు	రూ.122.51 కోట్లు
అమ్మఒడి	రూ.1,675.70 కోట్లు
రైతు భరోసా	రూ.1.510.70
శాశ్వత ఉద్యోగాలు	33,866 మందికి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఏడాది కూటమి పాలనలో జిల్లా ప్రజలు అన్ని విధాలుగా కుమిలిపోతున్నారు. అభివృద్ధి అటకెక్కింది. సంక్షేమం ఎత్తిపోయింది. ప్రజల ప్రధాన రాబడి వనరులైన వ్యవసాయం, వ్యాపారం, పారిశ్రామికం, నిర్మాణం, ఉపాధి వంటి తదతర రంగాలు కుప్పకూలిపోయాయి. ఏడాది ముందు వరకు ప్రజల జీవన ప్రమాణాలు ఆకాశమే హద్దుగా పెరుగుతుంటే.. గడిచిన ఏడాదిలో నేల చూపుల నుంచి పాతాళానికి పడిపోయింది. కూటమి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా రెడ్‌బుక్ రాజ్యాంగంతో హిట్లర్ పాలన సాగిస్తోంది.

ఎన్నికల్లో గెలవడానికి సూపర్ సిక్స్ అంటూ అడ్డమైన హామీలన్నీ ఇచ్చిన చంద్రబాబు అండ్ కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక నాలుక మడతేస్తున్నారు. గతంలోనూ సంక్షేమ పథకాలు అమలు చేస్తానంటూ ప్రగల్భాలు పలికి హామీలన్నీ ఎగ్గొట్టిన చంద్రబాబు.. ఈ ఎన్నికల్లో అదే రాగం అందుకున్నారు. అప్పట్లోనూ లోటు బడ్జెట్ అంటూ పథకాలకు పంగనామాలు పెట్టారు. తాజాగా సూపర్ సిక్స్ అంటూ ప్రచారం చేసి రాష్ట్రం ఆర్థిక వ్యవస్థ ధ్వంసమైందంటూ కొత్త రాగం అందుకున్నారు. అధికారం చేపట్టి ఏడాది అయినా ఏ పథకం అమలుకు ఇంత వరకు విధివిధానాలు రూపొందించలేదు.

నిరుద్యోగులకు ఉద్యోగం లేదు.. భృతి లేదు

జిల్లాలో సుమారు 4 లక్షల మంది విద్యావంతులైన నిరుద్యోగులు ఉన్నారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తానని, లేదంటే నెలకు రూ.3 వేల వంతున నిరుద్యోగ భృతి ఇస్తానని హామీలు గుప్పించారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం ఈ ఏడాది కాలంలో నిరుద్యోగులకు రూ.1,440 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. కొత్త పరిశ్రమ ఊసే లేదు. మెగా డీఎస్సీ అంటూ దగా డీఎస్సీ చేశారు. డీఎస్సీలో కనీసం 10 వేల టీచర్ పోస్టులైనా వస్తాయని ఎదురు చూసిన నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారు. కేవలం 700 లోపు ఉద్యోగాలు ఖాళీలు చూపించి ఏడాది తర్వాత పరీక్షలు నిర్వహించబోతున్నారు. ఉద్యోగాలు కల్పించడానికి మరో ఏడాదైనా పడుతుందని ఉపాధ్యాయ వర్గాలే చెబుతున్నాయి. ఇక నిరుద్యోగభృతి ఊసే లేదు. ప్రభుత్వ శాఖల్లో కొత్త ఉద్యోగాల ఆలోచనే లేదు.

చిరుద్యోగులను రోడ్డున పడేసిన పాలకులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ, సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చి అవుట్‌సోర్సింగ్ కొలువులు, వలంటీర్లు, ప్రైవేట్ రంగాల్లో అధికారికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించింది. వీరిలో సచివాలయ ఉద్యోగులు మినహా మిగతా వేలాది మందిని ఒక్క కలంపోటుతో పీకి పారేసింది. కూటమి ప్రభుత్వ నిర్ణయాలకు 15,417 మంది వలంటీర్లు రోడ్డున పడ్డారు. ఇక ఉపాధి హామీ పథకంలో అయితే వందలాది మందిని తొలగించి పచ్చపార్టీ కార్యకర్తలకు కట్టబెట్టారు. ఇక ప్రభుత్వ అధీనంలో నడిచే మద్యం దుకాణాలను ప్రైవేట్ పరం చేసి అందులో అవుట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు చేసుకుంటున్న వందల మంది ఉపాధికి గండికొట్టారు. తాజాగా ఎండీయూ వాహనాలను రద్దు చేసి సుమారు వెయ్యి మందిని రోడ్డున పడేశారు. రెగ్యులర్ ఉద్యోగాలు కాకుండా ఇతర ఉద్యోగాల లెక్క ప్రకారం దాదాపు 27 వేల మందికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా నిరుద్యోగ భృతి కల్పించిందనే చెప్పాలి.

గత ప్రభుత్వంలో అభివృద్ధి కొత్త పుంతలు

జిల్లాలో గత ప్రభుత్వ అభివృద్ధి తప్ప.. ఏడాది కూటమి పాలనలో అభివృద్ధికి రూపాయి కేటాయించలేదని చెప్పాలి. గత ప్రభుత్వం సాగునీటి రంగానికి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చింది. రూ.960 కోట్లతో సోమశిల- కండలేరు వరద కాలువ ఆధునికీకరణ, రూ.840.90 కోట్లతో సోమశిల హైలెవల్ లిఫ్ట్ కెనాల్ నిర్మాణం, రూ.99.08 కోట్లతో సోమశిల ఆప్రాన్ పనులు, రూ.99.95 కోట్లతో సర్వే కాలువ ఆధునీకరణ పనులు పురోగతిలో ఉండగా, సుమారు రూ.500 కోట్లకుపైగా నిధులతో నెల్లూరు, సంగం బ్యారేజీలను పూర్తి చేసింది. రూ.3,743 కోట్లతో రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు పురోగతిలో ఉండగా, రూ.288 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తి చేశారు. ఇంతలోనే ఎన్నికల రావడంతో ప్రారంభం కాలేదు. ఆ తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించినా వినియోగంలోకి తేవడంతో కూటమి ఘోరంగా విఫలమైంది.

తల్లికి వందనం.. పంగనామం



జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు 4.10 మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం చెప్పినట్లు ఏడాదికి రూ.615 కోట్ల లబ్ధి చేకూరాల్సి ఉంది. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్లో ఒక బిడ్డకే పథకం అమలు చేసి 2.27 లక్షల మందికి అమ్మఒడి పథకం కింద ఏడాదికి రూ.15 వేల వంతున అందజేసింది. తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి ఉంటే.. మరో రూ.2 వేలు పెరిగి ఉండేది. కూటమి ప్రభుత్వం ప్రతి ఇంట్లో ఎంత మంది ఉంటే.. అంత మంది పిల్లలకు తల్లికి వందనం ఇస్తామని పంగనామాలు పెట్టారు. ఈ నెలలో స్కూళ్లు ప్రారంభమయ్యాక ఇస్తామని చెబుతున్నా.. ఇంత వరకు అర్హులైన లబ్ధిదారుల నుంచి కనీసం బ్యాంక్ ఖాతా నంబర్లు కూడా సేకరించలేదు. దీన్ని బట్టి ఈ సారికి కూడా.. సారీనే.

ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సుకు 11 లక్షల మంది అర్హులు




18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీలు గుప్పించారు. జిల్లాలో ఇలాంటి అర్హులు సుమారు 11 లక్షల మందికి పైగా ఉన్నట్లు అంచనా. జిల్లాలో మహిళా ఓటర్ల లెక్క ప్రకారం 10,52,819 మంది ఉన్నారు. ఓటర్లు కానీ లెక్క ప్రకారం సుమారు మరో 50 వేల మంది వరకు ఉండొచ్చు. ఆడబిడ్డ నిధి కింద ఈ ఏడాదిలో జిల్లాలోని అర్హులైన మహిళలు రూ.1,896 కోట్లు నష్టపోయారనే చెప్పాలి. ఇక జిల్లాలో నిత్యం బస్సుల్లో ప్రయాణించే మహిళల సగటున లెక్క చూస్తే 3 లక్షల మంది ఉంటున్నారు. ఏడాదిలో సగటున ఒక్కొక్క మహిళకు రూ.2 వేల బస్సు ప్రయాణ ఖర్చు లెక్క పెట్టినా ఈ ఏడాది కాలంగా రూ. 220 కోట్లు నష్టపోయారు.

7.30 లక్షల కుటుంబాలకు ఉచిత గ్యాస్



జిల్లాలో అధికారికంగా బీపీఎల్ కింద రేషన్ కార్డులు కలిగిన వారు దాదాపు 7.50 లక్షలకుపై ఉన్నారు. కొంత మేర అటూ ఇటూ తగ్గినా 7.30 లక్షల కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు చొప్పున పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ పథకం కింద ఏడాదికి సుమారు రూ.197 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఈ పథకం కూడా అరకొర మందికే అందుతోంది.

2.45 లక్షల మంది రైతులకు మొండి చేయి..



జిల్లాలో వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం 2.45 లక్షల మంది రైతులు, కౌలు రైతులు ఉన్నారు. గత ప్రభుత్వం అందరికీ కలిపి రైతు భరోసా పథకాన్ని అమలు చేసింది. కూటమి ప్రభుత్వం వీరికి రూ.20 వేల వంతున ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ లెక్కన వీరికి ఏడాదికి రూ.430 కోట్లు చెల్లించాల్సి ఉంది. గతేడాది పంగనామాలు పెట్టారు. ఈ ఏడాదైనా ఇస్తారంటే.. నమ్మకం కనిపించడం లేదు. ఈ పథకాన్ని అమలు చేయడానికి ఇంత వరకు వ్యవసాయశాఖకు ఎలాంటి విధివిధానాలు నిర్ణయించలేదు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా మే నెలలోనే ఈ పథకం ద్వారా సాయం అందించింది.

మొదటి రోజు నుంచే రెడ్‌బుక్ రాజ్యాంగం



సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఏడాదిగా విస్మరించిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని మాత్రం అమలు చేస్తోంది. కక్ష రాజకీయాలు ప్రోత్సహిస్తూ కాలకేయులు కంటే దారుణంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని, సంక్షేమ పథకాలను అడిగే వారిని అక్రమ కేసులతో జైలుకు పంపుతున్నారు. జిల్లాలో అధికార పార్టీని బదనాం చేస్తున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై రుస్తుం మైన్స్‌లో అక్రమ మైనింగ్ చేయించారనే సాకు పెట్టి జైలుకు పంపారు. సోషల్ యాక్టివిస్టులతోపాటు కావలిలో జర్నలిస్టులను జైలుకు పంపారు.

హామీలు అమలు చేస్తే ఒట్టు



ఏడాది పాలనలో ఒక్కహామీ కూడా అమలు చేయలేదు. సూపర్ సిక్స్ ఊసేలేదు. ఎన్నో హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత వాటి గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరం. పేద వర్గాలను ఇబ్బందులు పెట్టడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా దళితులు, ముస్లింలు, పలు రాజకీయ పార్టీలకు చెందిన వారిపై భౌతిక దాడులు చేయడం తప్ప ఈ ఏడాదిలో ప్రజలకు ఏమీ ఒరిగింది లేదు.

– జీవీబీ కుమార్, సీపీఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి

ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదు



కూటమి ప్రభుత్వ ఈ ఏడాది పాలనలో ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదు. వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదానికి మద్దతు ఇచ్చి ముస్లింలకు తీరని ద్రోహం చేసింది. ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం తప్ప మరేమీ చేయలేదు. సూపర్ సిక్స్ అమలు చేయలేదు. రేషన్ బండ్లు తీసి వేసి ప్రజలను మరింత ఇబ్బంది పెడుతున్నారు.

– సయ్యద్ ఫజుల్, వైస్ ఎంపీపీ, ఉలవపాడు

ఒక్క పథకం ఇవ్వలేదాయె..



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కటి నేరవేర్చలేదు. ప్రజలకు ఎంతో మేలు చేసిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను నిర్వీరం చేస్తున్నారు. ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేసి, భయాందోళనలకు గురి చేస్తున్నారు. వెన్నుపోటు చంద్రబాబు కలిసొచ్చిన అయుధం. అతని నైజం తెలిసీ కూడా మారి ఉంటాడని ప్రజలు ఓట్లు వేశారు.

– కాటం రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, కలిగిరి

కూటమి పాలనలో రోడ్డున పడిన ప్రజలు

నేడు కూటమి వెన్నుపోటు దినం

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి
- విజయవంతం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎంతో మంది పేదలు, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు, వ్యాపారస్తులు, పెన్షనర్లు, వృద్ధులు రోడ్డున పడ్డారని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరు సిటీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి నేతలు అధికారంలోకి రావడం కోసం ఎన్నో మాయమాటలు చెప్పారన్నారు. అయితే ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజలకే ఏదో మేలు చేసినట్లు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చినట్లు సంబరాలు చేసుకుంటుందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, 3 లక్షల మంది ఉద్యోగులను రోడ్డును పడేసిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. రైతులకు ఏడాదికి రూ.20 వేలు అన్నదాతసుఖీభవ, నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు చొప్పున ఏడాదికి రూ.36 వేలు, మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, 50 ఏళ్లు నిండిన మహిళలకు పింఛన్ ఇస్తామన్నారు. ఉద్యోగులకు ఐఆర్, పీఆర్‌సీ అని ఇలా అనేక హామీలిచ్చి వాటిని నెరవేర్చకుండా ప్రతి ఒక్కరిని మోసం చేసి సంబరాలు చేసుకోవడానికి సిద్ధమైందన్నారు. విద్యుత్ చార్జీలను ప్రభుత్వం విపరీతంగా పెంచిందన్నారు. కూటమి ఏడాది పాలన తర్వాత వైఫల్యాలను, మోసాలను నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధం కావడానికి.. బుధవారం కూటమి వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేతిలో నష్టపోయిన ప్రతి వర్గం ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరారు. నగరంలోని వీఆర్‌సీ సెంటర్లో ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలతో కలిసి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు వీఆర్ కళాశాల వద్దకు తప్పకుండా హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జీజీహెచ్‌లో 'గుండె'కు భరోసా

- రూ.5.67 కోట్లతో క్యాథ్ ల్యాబ్
- అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ సేవలు
- బైపాస్ సర్జరీ, స్టంట్‌లు వేసేందుకు అవకాశం



నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. గుండెకు సంబంధించి బైపాస్ సర్జరీ, స్టంట్‌లు వేసే సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు రూ.5.67 కోట్లతో క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఓపీ సేవలు పెరగడం, ఆపరేషన్లు పెరగడం, కనీస వసతులు మెరుగుపడడంతోపాటు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) నిబంధనలు పూర్తిగా ఆచరించడంతో ఇటీవల ఆస్పత్రికి గుండె విభాగాన్ని మంజూరు చేశారు. అందులో భాగంగా వారం క్రితమే హార్ట్ స్పెషలిస్టు డాక్టర్ మంజులను నియమించడంతో ఆమె విధుల్లో చేరారు. మరో ముగ్గురు గుండె వైద్య నిపుణులను నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నియమించనుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో గుండె వ్యాధులకు సంబంధించి వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో రానున్నాయి. బైపాస్ సర్జరీ చేయాల్సి ఉన్నా.. స్టంట్‌లు వేయాల్సి ఉన్నా.. ఇకపై ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి రూ.లక్షలకు, లక్షలు ఖర్చు పెట్టుకోవాల్సిన అవసరం ఉండదు.

గుండె జబ్బులకు నాణ్యమైన వైద్యం

జీజీహెచ్‌లో గుండె వైద్య విభాగాన్ని ఏర్పాటు చేయాలని చాలా కాలంగా అడుగుతున్నాం. ఎన్‌ఎంసీ నార్మ్స్ అనుసరిస్తున్న నేపథ్యంలో గుండె విభాగంతో పాటు క్యాథ్ ల్యాబ్ మంజూరు కావడం ఎంతో సంతోషం. దీంతో పేద రోగులకు ఎలాంటి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించగలుగుతాం. అన్ని రకాల గుండె జబ్బులకు వైద్యసేవలు అందుతాయి.

– డాక్టర్ సిద్ధానాయక్, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

అష్టకష్టాలు పడుతూ..

రేషన్ తీసుకెళ్లేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. వ్యయప్రయాసల కోర్చి షాపుల వద్దకు వచ్చి క్యూలైన్లో ఉండి బియ్యం తీసుకెళ్తున్న పరిస్థితి ఉంది. నెల్లూరు నగరంలో రేషన్ తీసుకునేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నవాబుపేటలో క్యూలైన్, ఎండకు తాళలేక కూర్చొన్న ఇద్దరు వృద్ధులు







బియ్యం మోసుకెళ్తూ..



దేవుడా ఇంటికెళ్లేదెట్టా..: ఎండలో నిలబడి బియ్యం తీసుకున్నాక ఓ వృద్ధురాలిలా..



కిసాన్ నగర్‌లో చిన్నారికి తప్పని భారం

క్లుప్తంగా

మైపాడ్ బీచ్‌లో 'యోగాంధ్ర'



బాలికల యోగాసనాలను తిలకిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్, ఎమ్మెల్యే

ఇందుకూరుపేట: ప్రముఖ పర్యాటక కేంద్రమైన మైపాడు బీచ్‌లో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 8 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం బాగుండాలంటే జీవనశైలిని మార్చుకోవాలన్నారు. అందుకు యోగా మంచి సాధనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టూరిజం ఆర్డీ రమణ ప్రసాద్, జెడ్పీ సీఈఓ విద్యారమ, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు నాగరాజకుమారి, గంగాభవాని, జిల్లా టూరిజం అధికారి ఉషశ్రీ, డీటీసీ చందర్, డీఎస్‌డీఓ యతిరాజ్, సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం



జీవరత్నాన్ని పరామర్శిస్తున్న నాయకులు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గ్రౌండ్ మార్కర్‌గా, స్వీపర్‌గా పనిచేస్తూ తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన జీవరత్నానికి నెల్లూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆర్థిక సహాయాన్ని అందించింది. గత నెల 31వ తేదీన సాక్షిలో 'కదల్లేడు.. సాయం చేయండి' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించి మంగళవారం డైకస్ రోడ్డులోని ఎస్‌సీసీ కాలనీలో ఉన్న జీవరత్నం ఇంటికి అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ రంజీ క్రీడాకారుడు, సీనియర్ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి, అసోసియేషన్ సెక్రటరీ కామేశ్వరి వెళ్లి పరామర్శించారు. రూ.10 వేల సాయాన్ని అందించారు. జీవరత్నం ఉన్న దయనీయ పరిస్థితిని చూసి మానవత్వంతో సహాయం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సుకృత, హరి, మహేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

మర్రిపాడు: మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2026 – 27 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 1, 2014 నుంచి ఏప్రిల్ 30, 2016 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. దరఖాస్తుకు ఎటువంటి రుసుము లేదని, నవోదయ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొత్తం 100 మార్కులకు 2 గంటల పరీక్ష ఉంటుందని, ఫలితాలు 2026 జూన్‌లో విడుదల కానున్నట్లు వెల్లడించారు.

స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి 2025 – 26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా పుట్టంపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్లో 4, 5 తరగతి విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 19వ తేదీలోపు https://apsportsschool.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం తరగతుల వారీగా సీట్ల వివరాలు, షెడ్యూలు, నోటిఫికేషన్, హెల్ప్ డెస్క్ తదితర వాటి కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలియజేశారు.

ఉచిత బస్సు.. అంతా తుస్

చంద్రబాబు.. ఈ పేరు మోసానికి, దగాకు పర్యాయపదాలుగా చెప్పొచ్చు. అధికారం కోసం అడ్డమైన హామీలివ్వడం ఆ తర్వాత ఎగనామం పెట్టడం ఆయనకే చెల్లింది. గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో మహిళల కోసం అనేక పథకాలను ప్రకటించారు. అందులో ఉచిత బస్సు ఒకటి. అధికారంలోకి రాగానే అమలు చేస్తామంటూ చెప్పిన చంద్రబాబు, కూటమి పాలకులు ఏడాదిగా ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేస్తూ వస్తున్నారు.

- ఇదిగో అంటూ.. ఏడాదిలో 'ఆరు' సార్లు మాట మార్చిన వైనం
- తాజాగా ఆగస్ట్ 15వ తేదీ నుంచి అంటూ ప్రచారం
- ఇంత వరకూ విధివిధానాలు ప్రకటించలేదు.
- మూడు నెలలకొకసారి డేటా తీసుకుంటున్న ప్రభుత్వం



బస్సు కోసం ఎదురు చూస్తున్న మహిళలు తదితరులు



నెల్లూరులోని ప్రధాన బస్టాండ్ కార్యాలయం

నెల్లూరు సిటీ: మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం. దీన్ని ఎన్నికల అస్త్రంగానే కాకుండా.. ఇప్పుడు డైవర్షన్ రాజకీయాలకు కూటమి ప్రభుత్వం వాడుకుంటోంది. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఇదిగో ఉచిత బస్సు.. అదిగో అంటూ ఇప్పటికి ఎన్ని తేదీలు చెప్పారో వారికే తెలియదు. గతేడాది జూన్ 12వ తేదీన ప్రమాణ స్వీకారమయ్యాక.. ఆగస్టు 15వ తేదీ నుంచి అన్నారు. ఆ తర్వాత దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది... అంటూ ఇప్పటి వరకు ఏడాది గడిపేశారు. తాజాగా జరిగిన మహానాడుకు మహిళల నుంచి ఆదరణ కనిపించకపోవడం, ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు రావడంతో ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు అంటూ కొత్త బూరగ అందుకున్నారు. ప్రజల నుంచి ప్రభుత్వంపై వ్యతిరేకత విస్తృతం అవుతున్న సమయంలో మూడు నెలలకొకసారి అదిగో.. ఇదిగో అని చెబుతూ వారి దృష్టిని మళ్లించడానికి మంత్రులు, టీడీపీ నేతలు హడావుడి చేస్తున్నారు. డిపోల్లో బస్సుల సర్వీసుల జాబితా ఇవ్వాలని అప్పుడప్పుడు ఉన్నతాధికారులు కోరడం తప్ప.. ఏ ఉపయోగం లేకుండా పోయిందని ఆర్టీసీ అధికారులే చెప్పుకొంటున్నారు.

పెద్ద సంఖ్యలో..

జిల్లా పరిధిలో 7 ఆర్టీసీ డిపోలుండగా, మొత్తం 691 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. రోజూ పెద్ద సంఖ్యలో మహిళలు పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అటు తెలంగాణ, ఇటు కర్ణాటకలో కూడా ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించాయి. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ తిరిగినా టికెట్ లేకపోవడం గమనార్హం. కానీ ఇటీవల రాష్ట్ర శాసనమండలిలో ఉచిత బస్సు ప్రయాణంపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ సభ్యులు లేవనెత్తిన అంశంపై ఓ మహిళా మంత్రి చెప్పిన సమాధానం చూస్తే.. ఉచిత బస్సు ప్రయాణంపై కొర్రీలు ఉండక తప్పదని అనుమానాలు కూడా ఉన్నాయి. మండల పరిధికే పరిమితం చేస్తారా? డిపో పరిధికే పరిమితం చేస్తారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

జిల్లాలో ఆర్టీసీ డిపోలు	- 7
బస్సులు	- 691

హడావుడి చేస్తూ..

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్టీసీ అధికారులకు మూడు నెలలకు ఒకసారి జిల్లాలోని ఆర్టీసీ బస్సుల వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. మహిళలు ఎంతమంది ప్రయాణం చేస్తున్నారు. ఎన్ని సర్వీసులు నడుస్తున్నాయి? తదితర వివరాలను. తమకు పంపాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు సమాచారాలు సేకరిస్తుంటారు. ఇటీవల మరోసారి ఆర్టీసీ అధికారులు వెంటనే సర్వీసు వివరాలు ఇవ్వాలని హడావుడి చేస్తున్నారు. మంత్రులు సైతం ఆ పండక్కు.. ఈ పండక్కు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్నట్లు ప్రకటనలు విడుదల చేసిన విషయం తెలిసిందే.

మాట నిలబెట్టుకోవాలి



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తీసుకొస్తానని చంద్రబాబు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు ఉచిత బస్సు ప్రయాణంపై క్లారిటీ కూడా లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. నీతి లేని ప్రభుత్వం ఇది. ప్రతి సారి మాట తప్పడమేనా?

– జ్యోతి, దర్గామిట్ట

ఏడాదిగా ఎదురుచూస్తున్నాం



చంద్రబాబు మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తానని మాట ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా.. ఉచిత బస్సు ప్రయాణానికి మాత్రం నోచుకోలేదు. ప్రతి పండగకు.. ఇదిగో అదిగో.. అంటూ చెబుతూ కాలయాపన చేస్తున్నారు.

– పార్వతి, బాలాజీనగర్

ఆశ పోయింది



ఎన్నికలకు ముందు మహిళలకు ఉచిత బస్సు అంటూ చంద్రబాబు ప్రచారం చేశారు. అది నమ్మాం. కొత్తగా ఓట్లు వచ్చిన తాము కూడా ఓట్లేశాం. నేను గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో 3వ సంవత్సరం చదువుతున్నాను. ఉచిత బస్సు పథకం కోసం సంవత్సరం కాలంగా ఎదురు చూస్తున్నా. నెల్లూరు నుంచి గూడూరుకు వెళ్లాలంటే రోజుకు రానూ పోనూ రూ.130 చార్జీలవుతున్నాయి. ఉచిత బస్సు ఉంటే ఈ డబ్బులు మిగిలేవి. ఇప్పుడు ఉచిత బస్సు పథకంపై ఆశ పోయింది.

– ఎస్‌కే రిహానా, నెల్లూరు

మద్యం అనధికార విక్రయాలపై దాడులు

- పది ఫుల్ బాటిళ్ల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీ, ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): విశ్రాంత మిలటరీ ఉద్యోగుల నుంచి మద్యం బాటిళ్లు సేకరించి అధిక ధరలకు విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ అధికారుల కథనం మేరకు.. నెల్లూరు ఆకుతోట సమీపంలోని పార్థసారథి నగర్‌లో రామ్మోహన్ నివాసం ఉంటున్నారు. అతను విశ్రాంత మిలటరీ ఉద్యోగుల నుంచి మద్యం బాటిళ్లను సేకరించేవాడు. ఒక్కో ఫుల్ బాటిల్‌పై రూ.500 మార్జిన్ ఉంచుకుని ఇతరులకు విక్రయాలు సాగిస్తున్నాడు. దీనిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ దయాసాగర్‌కు మంగళవారం సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వై.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఎస్సైలు కాలేషావలి, సీహెచ్ పూర్ణకుమార్‌లు దాడి చేశారు. రామ్మోహన్‌ను అదుపులోకి తీసుకుని 10 బాటిళ్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం నిందితుడిని నెల్లూరు – 1 ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ ఎం.కిరణ్‌సింగ్, కానిస్టేబుల్స్ ఎన్.మునిరాజ్ కుమార్, కె.రమణయ్య పాల్గొన్నారు.

రెండో రోజూ బంగారు షాపుల్లో తనిఖీలు

నెల్లూరు సిటీ: కర్ణాటకలో జరిగిన బంగారం అక్రమ రవాణా కేసుకు సంబంధించి డీఆర్‌ఐ అధికారులు మంగళవారం కూడా తనిఖీలు నిర్వహించారు. నెల్లూరులోని కాపువీధిలోని నేషనల్ జ్యువెలరీలో రికార్డులను పరిశీలించారు. అదే విధంగా ఆ వీధిలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఓ నటికి సంబంధించిన బంగారం అక్రమ రవాణా కేసులో కీలక వ్యక్తి కొన్ని పాయింట్లను చూపించగా, అందులో నెల్లూరు నుంచి కూడా రవాణా జరిగినట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఇక్కడ ఎవరి పాత్ర ఉంది? ఎవరెవరు సహకరిస్తున్నారు? అనే కోణంలో అధికారులు కూపీలాగుతున్నారు. అందులో భాగంగా నేషనల్ జ్యువెలరీ దుకాణంలో రికార్డులు పరిశీలించారు. మరికొన్ని షాపుల యజమానులకు కూడా అక్రమ రవాణాలో భాగస్వామ్యం ఉన్నట్లు సమాచారం. పూర్తి విచారణ జరిగితే అసలు విషయాలు బయటకు వస్తాయి.

కండలేరులో 39.878 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 39.878 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,160, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

బంగారు ఉంగరం కోసమే హత్య

లింగసముద్రం: తోపూరి నరసింహంను దారుణంగా హత్య చేసిన చలంచర్ల బ్రహ్మయ్యను అరెస్ట్ చేసి కందుకూరు కోర్టులో హాజరుపరిచినట్లు గుడ్లూరు సీఐ మంగారావు చెప్పారు. బంగారు ఉంగరం కోసమే బ్రహ్మయ్య హత్య చేసినట్లు విచారణలో తేలిందన్నారు. వివరాలను సీఐ మంగళవారం వెల్లడించారు. పొన్నలూరు మండలం రావులకొల్లు గ్రామానికి చలంచర్ల బ్రహ్మయ్య కుటుంబ సభ్యులతో పదేళ్ల నుంచి పెంట్రాల ఎస్టీ కాలనీలో ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. గత నెల 30వ తేదీన నరసింహం నిమ్మతోటకు కంచె వేసేందుకు బ్రహ్మయ్యను తీసుకెళ్లాడు. పని చేస్తుండగా నరసింహం చేతికున్న పచ్చరాయి బంగారపు ఉంగరాన్ని చూసి దానిని ఎలాగైనా దక్కించుకోవాలని బ్రహ్మయ్య భావించాడు. నరసింహంను మొద్దు కత్తితో నరకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఉంగరాన్ని తీసుకుని కందుకూరులో విక్రయించాడు. రాత్రి మృతదేహాన్ని పక్క పొలంలోకి లాక్కెళ్లి ముక్కలుగా నరికి బోరుబావిలో పడేశాడు. బ్రహ్మయ్యను విచారించగా తాను బంగారు ఉంగరం కోసమే నరసింహంను హత్య చేసినట్లు అంగీకరించాడని సీఐ చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి కందుకూరు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.

కొంత భూమి వదులుకోండి

- దళితుల భూముల విషయంలో ఎస్సై పంచాయితీ



మాట్లాడుతున్న బాధితులు

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలంలోని పెళ్లేరు పంచాయతీ పుల్లనీళ్లపల్లి గ్రామంలోని దళితులకు ప్రభుత్వం అందజేసిన భూములపై వివాదం ఏర్పడిన విషయం తెలిసిందే. దీనిపై సాక్షిలో మంగళవారం దళితుల భూములపై టీడీపీ నేత కన్ను అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. చేజర్ల ఎస్సై తిరుమలరావు బాధిత దళితులు, సదరు నాయకులను స్టేషన్‌కు పిలిపించారు. ఆయనే పంచాయితీ నిర్వహించారు. మాజీ సైనికుడు పెంచలయ్య కుటుంబీకుల కథనం మేరకు.. రెండున్నర ఎకరాల భూమి వదులుకోవాలని, మిగిలింది మీరే ఉంచుకోవాలని ఎస్సై అనడంతో తాము ఒప్పుకోలేదన్నారు. అన్ని పత్రాలున్నాయని, వాటి రుజువుల మేరకు భూములు మాకే చెందుతాయని పేర్కొనడంతో స్థానిక టీడీపీ నాయకుడు మరోచోట పోరంబోకు భూమి చూపుతానని, దానిని తీసుకోవాలని దబాయించాడు. ఎస్సై సైతం ఆ నాయకుడికే మద్దతుగా మాట్లాడినట్లు పెంచలయ్య కుటుంబీకులు వాపోయారు. ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించిన క్రమంలో టీడీపీ నాయకులను కూర్చోబెట్టి, దళితులను నిలబెట్టి ఎస్సై పంచాయితీ చేశారన్నారు. తమ సెల్‌ఫోన్లను సైతం ముందుగానే తీసుకుని పంచాయితీ పూర్తయ్యే వరకు వారి వద్దనే ఉంచుకున్నట్లు చెప్పారు. టీడీపీ వారి ఫోన్లను మాత్రం అనుమతించినట్లు పేర్కొన్నారు.

మద్యానికి బానిసైన కుమారుడు

- చూసే దిక్కు లేక తల్లి ఆత్మహత్య

సోమశిల: అనంతసాగరం మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధురాలు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన షేక్ మాబున్నీ (67)కి ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల సంతానం. పెద్ద కుమారుడు షేక్ కాలేషా భార్య చనిపోయింది. దీంతో తల్లి అతని వద్దే ఉంటోంది. ఇటీవల కాలేషా మద్యానికి బానిసయ్యాడు. వృద్ధురాలిని చూసే దిక్కు లేకపోవడంతో వాస్మాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో స్థానిక వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.40
సన్నవి	రూ.24
పండ్లు	రూ.10